# వేగుచుక్క

పీడిత ప్రజల గొంతుక...

VC NEWS

TELUGU DAILY NEWS

www.veguchukkanews.com

నిజామాబాద్ అక్టోబర్ 27 ఆదివారం 2024

వెల: రూ.3/- పేజీలు : 4 సంపుటి:02 సంచిక: 100

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD





దండుపాళ్యం బ్యాచ్‌లా బిఆర్ఎస్ సోషల్ మీడియా



‘ఒకే రాష్ట్రం ఒకే పోలీసు విధానం’ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ప్రత్యేక పోలీస్ కానిస్టేబుళ్లు వరంగల్, ఆదిలాబాద్, మంచిర్యాల జిల్లాల్లో శనివారం నిరసన తెలిపారు.

# పోలీసులమా.. పనివాళ్లమా?

ఇష్టం వచ్చినట్లు డ్యూటీలు వేసి కుటుంబాన్ని దూరం చేస్తున్నారు

వరంగల్, సిరిసిల్ల, ఆదిలాబాద్, మంచిర్యాల జిల్లాల్లో ప్రత్యేక కానిస్టేబుళ్ల ఆందోళన

- నిన్న భార్యలు, ఇవాళ ఏకంగా పోలీసులు
- వరంగల్ జిల్లా మామునూరులో రోడ్డెక్కిన ఖాకీలు
- నల్లగొండ జిల్లా అన్నెపర్తిలోనూ పోలీసుల ఆందోళన
- ఇబ్రహీంపట్నం, మంచిర్యాలలో ఫ్యామిలీల ధర్నా
- వరుస నిరసనలతో పోలీసుశాఖ ఉక్కిరి బిక్కిరి

2లో

# దీపావళి కానుకగా.. ఇందిరమ్మ ఇళ్లు

**దీపావళి పర్వదిన కానుకగా ఇందిరమ్మ ఇళ్లను మొదటి విడతగా ప్రారంభించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది.**



హైదరాబాద్: దీపావళి పర్వదిన కానుకగా ఇందిరమ్మ ఇళ్లను మొదటి విడతగా ప్రారంభించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. దీపావళి రోజు అమావాస్య కాబట్టి.. ఆ తర్వాత మంచిరోజు చూసుకొని రాష్ట్ర వ్యాప్తంగా ఇందిరమ్మ గృహాల నిర్మాణానికి శ్రీకారం చుట్టనున్నట్లు రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రకటించారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో 3,500 ఇళ్ల చొప్పున ఇందిరమ్మ గృహాలను నిర్మించనున్నట్లు తెలిపారు. పార్టీలు, కులాలు, మతాలకు అతీతంగా గ్రామ సభలు నిర్వహించి బహు పేదలను పారదర్శకంగా ఎంపిక చేయాలని రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయించినట్లు ఆయన వెల్లడించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన సచివాలయంలో శనివారం దాదాపు నాలుగు గంటలకు పైగా జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో పలు కీలక నిర్ణయాలకు ఆమోదం తెలిపారు. ఆ వివరాలను మంత్రులు పొంగులేటి, పొన్నం ప్రభాకర్ విలేకరుల సమావేశంలో వెల్లడించారు. ఈనెల 31లోగా దీపావళి పండగకు ముందే.. తాను చెప్పిన బాంబు పేలుతుందని పొంగులేటి ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. భూముల కేటాయింపుపై వస్తున్న ప్రచారంపై స్పందిస్తూ.. ఎవరికీ ఏ రకమైన భూములూ కేటాయించడం లేదని మంత్రి స్పష్టం చేశారు. మంత్రులు తెలియజేసిన వివరాలివీ...2020 నుంచి ప్రభుత్వ ఉద్యోగులకు ఐదు డీఏలు పెండింగ్‌లో ఉన్నాయి. వాటిల్లో ఒకటి ఇవ్వాలని క్యాబినెట్ నిర్ణయం తీసుకుంది. ఉద్యోగ సంఘాలు సంతోషంగా స్వీకరించాలి. ఆర్థిక పరిస్థితి కుదుటపడగానే అన్నీ క్లియర్ చేస్తాం.317 జీవో, 46 జీవోలపై సబ్ కమిటీ ఇచ్చిన నివేదికపై క్యాబినెట్ సుదీర్ఘంగా చర్చించింది. సుదూర ప్రాంతాల్లో ఉన్న ఉద్యోగులకు సంబంధించిన మెడికల్, స్పౌజ్, మ్యూచువల్ బదిలీలకు మంత్రివర్గం పచ్చజెండా ఊపింది. స్థానికత అంశం రాష్ట్రపతి పరిధిలో ఉన్నందున

- మిగతా 2వ పేజీలో

- ఒక్కో నియోజకవర్గంలో 3,500 గృహాల నిర్మాణం
- నవంబరు 30 లోగా రాష్ట్రంలో కులగణన
- మెట్రో రెండో దశకు ఆమోదం
- ప్రభుత్వ ఉద్యోగులకు ఒక డీఏ
- ఉద్యోగుల మెడికల్, స్పౌజ్, పరస్పర బదిలీలకు పచ్చజెండా
- రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో కీలక నిర్ణయాలు

## 26న పార్లమెంట్ ఉభయ సభల ప్రత్యేక సమావేశం



న్యూఢిల్లీ:భారత రాజ్యాంగ స్వీకరణ 75వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని నవంబర్ 26న పార్లమెంట్ ఉభయ సభల ప్రత్యేక ఉమ్మడి సమావేశం జరిగే అవకాశం ఉందని శనివారం అధికారులు వెల్లడించారు. 1949 నవంబర్ 26న రాజ్యాంగ సభ రజ్యాంగాన్ని ఆమోదించగా 1950 జనవరి 26న అది అమలులోకి వచ్చింది. సంవిధాన్ సభకు చెందిన సెంట్రల్ హాలులో లోక్‌సభ, రాజ్యసభ ఉమ్మడి సమావేశం నవంబర్ 26న జరిగే అవకాశం ఉంది. నవంబర్ 26వ తేదీని ఇదివరకు జాతీయ న్యాయ దినోత్సవంగా పాటించేవారు. రాజ్యాంగ విలువల గురించి ప్రజలను ప్రోత్సహించే ఉద్దేశంతో నవంబర్ 26వ తేదీని రాజ్యాంగ దినోత్సవంగా ప్రభుత్వం ప్రకటించింది.

## సన్నవడ్లకు రూ.500 బోనస్




- ధాన్యం సేకరణ కేంద్రాల ఏర్పాటు
- మెట్రో మార్గాల విస్తరణకు ఆమోదం
- ఉద్యోగులకు రెండు డిఎల చెల్లింపు
- ములుగులో గిరిజన వర్సిటీకి
- 211 ఎకరాల భూమి
- గోషామహల్‌లో ఉస్మానియా నిర్మాణం
- పలు నిర్ణయాలకు కేబినెట్ ఆమోదం

దీపావళి పండుగ వేళ ప్రభుత్వ ఉద్యోగులకు కూడా ప్రభుత్వం గుడ్ న్యూస్ చెప్పింది. పెండింగ్‌లో ఉన్న రెండు డీఏల విడుదలకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. మంత్రివర్గ సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు రెండు డీఏలు ఇచ్చేందుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. ఒక డీఏ వచ్చే నెల వేతనంతో.. మరో డీఏ మార్చిలో ఇవ్వాలని ప్రభుత్వ నిర్ణయించింది. పండుగ వేళ పెండింగ్‌లో ఉన్న రెండు డీఏ విడుదలకు ప్రభుత్వం పచ్చజెండా ఊపడంతో ఉద్యోగులు హార్షం వ్యక్తం చేస్తున్నారు.

## ఫిబ్రవరి 12నుంచి మేడారం మినీ జాతర

ములుగు: దక్షిణభారత కుంభమేళాగా ఖ్యాతిగాంచిన ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారం సమ్మక్క, సారలమ్మల మినీ జాతర తేదీలు ఖరారయ్యాయి. వచ్చే ఏడాది ఫిబ్రవరి 12 నుంచి నాలుగు రోజులపాటు ఈ మినీ జాతర జరగనుంది. రెండేళ్లకోసారి మేడారం మహా జాతర జరుగుతుండగా.. అధిక సంఖ్యలో భక్తులు వనదేవతలను దర్శించుకుని మొక్కులు చెల్లించుకుంటున్నారు.

వనంలో కొలువైన వనదేవతలు జనం మధ్యకు రావడంతో అడవి అంతా జనసంద్రమవుతుంది. మహా జాతర జరిగిన మరుసటి సంవత్సరం చిన్న జాతర నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఇవాళ సమావేశమైన పూజారులు.. మినీ జాతర తేదీలను ప్రకటించారు.



## రేవంత్ పాపం.. ఆయనకు శాపం: కేటీఆర్



హైదరాబాద్: సీఎం రేవంత్ రెడ్డి చేసిన పాపం.. రైతు మహేందర్‌రెడ్డి పాలిట శాపమైందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. సంపూర్ణంగా రైతు రుణమాఫీ చేస్తామని దేవుడిపై ఒట్లు వేసినా..రైతులకు తప్పని పాట్లు!! అంటూ ట్వీట్ చేశారు.“కాంగ్రెస్ వచ్చి.. మార్పు తెచ్చిందంటే ఏమో అనుకున్నాం..రైతుల చేతుల్లోకి పురుగుల మందు డబ్బా తెచ్చి పెట్టింది! రైతు బంధు రాలేదు.. రుణమాఫీ కాలేదు.. తెలంగాణలో బక్కచిక్కిన రైతు పరిస్థితి ఏమాత్రం బాగోలేదు.. దీనికంతటికీ కారణం అబద్ధాలతో అధికారం చేపట్టిన రేవంత్ సర్కార్ కాదా?” అంటూ నిలదీశారు.“ఎంతమంది రైతుల ఉసురు తీసుకుంటారు? ఇంకెంతమంది రైతుల చేతుల్లో పురుగుల మంది డబ్బా పెడతారు?. రైతులకు అభయం ఇచ్చేందుకు వెళ్తే అరెస్టులు చేసేందుకు మంత్రుల ఆదేశాలు.. ఇదేనా ప్రజా ప్రభుత్వం!! ఏమైంది మీ రైతు డిక్లరేషన్ రాహుల్ గాంధీ గారు!!. ఆరు గ్యారంటీలకు మాది పూచి అన్న గాంధీ ఫ్యామిలీ ..ఈ రైతుల చావులకు బాధ్యత వహించాలి!!. ఇది ఆత్మహత్య కాదు.. కాంగ్రెస్ సర్కార్ చేసిన హత్య!!” అంటూ దుయ్యబట్టారు.

## కమిషన్ల కోసమే కాళేశ్వరం నిర్మాణం

- అన్ని కేసులపైనా విచారణ సాగుతున్నాయి
- అవినీతి నేతలను ఎవ్వరినీ వదిలే ప్రసక్తి లేదు
- కాంగ్రెస్ ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తుంది
- కేబినెట్ విస్తరణ అధిష్టానం, సిఎం చూస్తారు
- త్వరలోనే పార్టీ పునర్వ్యవస్థీకరణ చేపడతాం
- మీడియాతో ఇష్టాగోష్టిలో పిసిసి చీఫ్ మహేశ్ కుమార్

2లో






# నాలుగు గంటల్లోనే హైదరాబాద్ టు విశాఖపట్నం

విశాఖపట్నం : హైదరాబాద్ నుంచి విశాఖపట్నం వెళ్లాలంటే ఎంత సమయం పడుతుంది? సాధారణ రైళ్లలో వెళ్తే 12 గంటలు.. అదే వందేభారత్ రైలులో అయితే 8.30 గంటల్లోనే వెళ్లొచ్చు. కానీ అదే నాలుగు గంటల్లోనే హైదరాబాద్ నుంచి వైజాగ్ వెళ్లగలిగితే ఎలా ఉంటుంది.. అతి త్వరలోనే ఆ కోరిక తీరబోతుంది. హైదరాబాద్ నుంచి వైజాగ్ మధ్య రైలు ప్రయాణ సమయాన్ని తగ్గించే ప్రాజెక్టుకు సంబంధించిన ప్రణాళిక కీలక దశకు చేరుకుంది. ఈ మేరకు శంషాబాద్ నుంచి విశాఖపట్నం మధ్య సెమీ హైస్పీడ్ రైలు కారిడార్ ఎలైన్‌మెంట్ ఖరారైంది. సికింద్రాబాద్ నుంచి వైజాగ్‌కు ప్రస్తుతం రెండు మార్గాల్లో రైళ్లు వెళ్తున్నాయి. మొదటిది వరంగల్-ఖమ్మం-విజయవాడ మార్గం. రెండోది నల్గొండ-గుంటూరు-విజయవాడ. ఈ రెండు మార్గాల్లో గంటకు 110 నుంచి 130 కి.మీ. వేగంతో రైళ్లు ప్రయాణిస్తున్నాయి. కానీ గంటకు 220కి.మీ. వేగంతో రైల్లు ప్రయాణించేలా ఇప్పుడు కొత్త మార్గాలను రైల్వే శాఖ ప్రతిపాదించింది. ఇందులో ఒకటి హైదరాబాద్ -విజయవాడ జాతీయ రహదారిని అనుకుని ఉన్నట్లుగానే ఉంటుంది. దీన్ని సూర్యాపేట, విజయవాడ మీదుగా మొదటి మార్గాన్ని ప్రతిపాదించింది. ఇందులో భాగంగా వైజాగ్ నుంచి విజయవాడ, సూర్యాపేట మీదుగా కర్నూలుకు మరో కారిడార్‌ను నిర్మించనున్నారు. ఇది వైజాగ్ నుంచి మొదలై సూర్యాపేట, నల్గొండ, కల్వకుర్తి, నాగర్‌కర్నూలు మీదుగా కర్నూలు చేరుతుంది. వీటి ప్రిలిమినరీ ఇంజనీరింగ్, ట్రాఫిక్ (పెట్) సర్వే తుది దశకు చేరింది. ఈ సర్వే నివేదికను నవంబరులో రైల్వే బోర్డుకు సమర్పించనున్నట్లు తెలుస్తోంది. ఈ మార్గంలో శంషాబాద్, రాజమండ్రి విమానాశ్రయాలకు అనుసంధానించేలా ఈ ప్రణాళికను రూపొందించడం విశేషం. విమాన ప్రయాణికులు అతి తొందరగా స్వస్థలాలకు వెళ్లేలా ఈ సెమీ హైస్పీడ్ రైళ్ల ప్రణాళికను రూపొందించింది.

# దండుపాళ్యం బ్యాచ్‌లా బిఆర్ఎస్ సోషల్ మీడియా

**హైదరాబాద్:** బిఆర్ఎస్ సోషల్ మీడియా దండుపాళ్యం బ్యాచ్‌లా మారిందని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. తనపై తప్పుడు ప్రచారం చేసిన వాళ్లను వదిలిపెట్టనని హెచ్చరించారు. తాను కలెక్టర్‌ను తిట్టినట్టు వీడియో క్రియేట్ చేసి తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. తనపై ట్రోల్ చేసేవాళ్లు దొరికితే బట్టలూడదీసి కొడతాననని జగ్గారెడ్డి వార్నింగ్ ఇచ్చారు. బిఆర్ఎస్ నేతలు కేటీఆర్, హరీష్ రావులపై జగ్గారెడ్డి విరుచుకు పడ్డారు. వారిద్దరికీ మతిభ్రమించిందని దుయ్యబట్టారు. శనివారం మీడియాతో మాట్లాడిన ఆయన.. అధికారం లేక కెటిఆర్, హరీశ్ రావు ఇష్టమొచ్చినట్టు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని, కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బద్నాం చేయాలని చూస్తున్నారని ఫైరయ్యారు. ఇక, మహిళా కలెక్టర్‌పై తెలంగాణ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ఓ కలెక్టర్‌కు తాను ఫోన్ చేస్తే ఎత్తలేదని, దీంతో తనకు కోపం వచ్చి తిట్టానంటూ బహిరంగంగానే చెప్పారు. కలెక్టర్‌పై ఆయన చేసిన వ్యాఖ్యలు తీవ్ర కలకలం రేపుతున్నాయి. దీనిపై జగ్గారెడ్డి మరోసారి స్పందించారు.




తాను చేసిన వ్యాఖ్యలు ప్రస్తుత కలెక్టర్‌ను ఉద్దేశించి కాదని.. గత ప్రభుత్వ హయాంలో కలెక్టర్లపై వ్యాఖ్యలు చేసినట్లు ఆయన వెల్లడించారు. బీఆర్ఎస్ హయాంలో ఇద్దరు కలెక్టర్‌లకు పది సార్లు ఫోన్ చేసినా ఎత్తలేదు.. వాళ్ళని తిట్టాను.. తప్పేంటి. నేను తిట్టింది గత ప్రభుత్వంలో... ఇప్పుడు కాదు' అంటూ వివరణ ఇచ్చారు.

అలాగే.. బీఆర్ఎస్ సోషల్ మీడియాపైనా జగ్గారెడ్డి ఫైర్ అయ్యారు. శనివారం గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడుతూ... బీఆర్ఎస్ సోషల్ మీడియా దండుపాళ్యం ముఠాలాగా తయారైందంటూ విరుచుకుపడ్డారు. అధికారం కోల్పోవడంతో కేటీఆర్, హరీష్ రావుకు పిచ్చిపట్టిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బద్నాం చేయడమే పనిగా పెట్టుకున్నారని మండిపడ్డారు. బీఆర్ఎస్ సోషల్ మీడియా చర్యలతో కేటీఆర్, హరీష్ రావులు తిట్లు తింటున్నారన్నారు. అమెరికా, సింగపూర్‌ల నుంచి సోషల్ మీడియా నడపడం కాదని... దమ్ముంటే

ధైర్యంగా ముందుకు రావాలన్నారు. సోషల్ మీడియా నడిపేది ఎవడో తెలిస్తే ఖైరతాబాద్ సెంటర్లో బట్టిలిప్పి కొడతా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. సమస్యలపై పోరాడితే తప్పులేదని.. కానీ వ్యక్తిగత అంశాలపై బీఆర్ఎస్ సోషల్ మీడియా ట్రోల్ చేస్తోందన్నారు. సీఎం వ్యాఖ్యలు అననివి అన్నట్టుగా ప్రచారం చేస్తున్నారన్నారు. ఈరోజు వార్నింగ్ ఇస్తున్నా తేడా వస్తే తాట తీస్తా. రేవంత్ రెడ్డి, జగ్గారెడ్డి ఫైటర్స్.. బీఆర్ఎస్ నేతలు ఇలానే వ్యవహరిస్తే మా సోషల్ మీడియాను రంగంలోకి దింపుతాం. కేటీఆర్ డబుల్ లచ్చా. చిట్టి నాయుడు కాదు... రేవంత్ రెడ్డి గట్టి రెడ్డి. రేవంత్ రెడ్డి తన ఛాంబర్లో తొడగొడితే కేటీఆర్‌కు కాళ్ళు వణుకుతాయి. జగ్గారెడ్డి మాటే శాసనం అని జగ్గారెడ్డి స్పష్టం చేశారు. తనకు కోపం వస్తే ఇలాగే ఉంటుందని అన్నారు.

# పోలీసులమా.. పనివాళ్లమా?



మామునూరు : 'ఒకే రాష్ట్రం ఒకే పోలీసు విధానం' అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ప్రత్యేక పోలీస్ కానిస్టేబుళ్లు వరంగల్, ఆదిలాబాద్, మంచిర్యాల జిల్లాల్లో శనివారం నిరసన తెలిపారు. మరోవైపు బెటాలియన్ కమాండెంట్ అనుచిత వ్యాఖ్యలు చేశారని ఆగ్రహం వ్యక్తం చేస్తూ సిరిసిల్లలో ఆందోళనకు దిగారు. సెలవుల విషయంలో ప్రభుత్వం సానుకూలంగా స్పందించిన నేపథ్యంలో ఆ ఒక్క సమస్యే ఎజెండా కాదని ఏఆర్, సివిల్ పోలీస్ విధానం రద్దు చేసి 'ఒకే రాష్ట్రం.. ఒకే పోలీసు విధానం' అమలు చేయాలని డిమాండ్ చేస్తూ వరంగల్ జిల్లా మామునూరు టీజీఎస్పీ 4వ బెటాలియన్‌లో కానిస్టేబుళ్లు యూనిఫాంలోనే నిరసన తెలిపారు. వరంగల్ పోలీసు కమిషనర్ అంబర్ కిషోర్ ఝా బెటాలియన్‌కు చేరుకొని సిబ్బందితో చర్చలు జరపడంతో ఆందోళన విరమించి విధుల్లోకి వెళ్లారు. మరోవైపు బెటాలియన్ కమాండెంట్ శ్రీనివాస్‌రావు అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రం పరిధి సర్దాపూర్‌లోని 17వ బెటాలియన్ పోలీసులు ఆందోళనకు దిగారు. తమ భార్యలపై అనుచిత వ్యాఖ్యలు ఎందుకు చేశారంటూ కమాండెంట్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న ఎస్పీ అఖిల్ మహాజన్ అక్కడికి చేరుకొని ఆందోళన చేస్తున్న పోలీసులతో మాట్లాడారు. ఇష్టం వచ్చినట్లు డ్యూటీలు వేసి కుటుంబాన్ని దూరం చేస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. తాము పోలీసులమా.. పనివాళ్లమా తెలియడం లేదని, వాగులో ఇసుక, మిషన్ భగీరథ పైపులు తీసుకురావాలని కమాండెంట్ ఆదేశాలు జారీ చేస్తున్నారని వాపోయారు. తమకు కుటుంబాలను దూరం చేయవద్దని, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల్లో ఉన్న పోలీస్ విధానాన్ని తెలంగాణలో అమలు చేసి న్యాయం చేయాలని ఓ కానిస్టేబుల్ ఎస్పీ కాళ్లపై పడి వేడుకున్నారు. ఆదిలాబాద్ జిల్లా యాపల్‌గూడ రెండో బెటాలియన్ పోలీసులు కుమురంభీం చౌరస్తా వద్ద కుటుంబ సభ్యులతో కలిసి ఆందోళన చేపట్టారు. మంచిర్యాల జిల్లా గుడిపేటలోని టీజీఎస్పీ 13వ పటాలం పోలీసులు, వారి కుటుంబసభ్యులు జిల్లా కేంద్రంలోని రైల్వేవంతెనపై రాస్తారోకో నిర్వహించారు. చిన్నపిల్లలతో తరలివచ్చిన పోలీసు కుటుంబాలు రోడ్డుపై బైఠాయించడంతో వాహనాలు భారీగా నిలిచిపోయాయి. ఏసీపీ ప్రకాశ్ ఆందోళనకారులతో మాట్లాడడంతో ఆందోళన విరమించారు.

పోలీసు కుటుంబాలు రోడ్డెక్కడం మొదటిసారి: మాజీ మంత్రి సబిత

పోలీసు కుటుంబాలు రోడ్డెక్కడం చరిత్రలో మొదటిసారని మాజీ మంత్రి సబితారెడ్డి అన్నారు. హోంశాఖ నిర్వహిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వల్లే ఈ పరిస్థితి దాపురించిందని విమర్శించారు. తెలంగాణ భవన్‌లో శనివారం ఆమె విలేకర్లతో మాట్లాడారు. రాష్ట్రంలో హోంమంత్రి లేకపోవడం వల్ల కానిస్టేబుళ్లు తమ కష్టాలు ఎవరికి చెప్పుకోవాలో తెలియని పరిస్థితి నెలకొందన్నారు. ఏక్ పోలీస్.. వ్యవస్థపై ముఖ్యమంత్రి మాటను నిలబెట్టుకోవాలని కోరారు. ఎమ్మెల్సీ వాణీదేవి మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రజాపాలన ఉందా అనే అనుమానం కలుగుతుందన్నారు.

# కమిషన్ల కోసమే కాళేశ్వరం నిర్మాణం

**న్యూఢిల్లీ:** కమిషన్ల కోసమే కాళేశ్వరం నిర్మించారని ప్రపంచానికంతా తెలిసిందని, అందుకే కెసిఆర్ కుటుంబ అవినీతిపై చర్యలకు సర్వత్రా డిమాండ్ పెరుగుతోందని టీపీసీసీ చీఫ్, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. అవినీతి పరులను ప్రభుత్వం వదలబోదని అన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం కమిషన్ల కోసం కాళేశ్వరం డిజైన్ మార్చి వ్యయం పెంచారని ఆరోపించారు. కమిషన్ల కోసం కాళేశ్వరం కట్టారని.. ప్రజాధనం దుర్వినియోగం చేశారని విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ లో జరిగిన అవకతవకలపై కమిషన్ విచారణ జరపుతోందని.. కాళేశ్వరం వాస్తవాలు బయటకు రావాలని అన్నారు. అన్యాయంగా ప్రభుత్వం ఎవరిపైన కేసులు పెట్టదని.. అదే విధంగా తప్పు చేసిన ఎవరినీ వదలదని హెచ్చరించారు. రాష్ట్రంలో చర్చనీయాంశంగా మారిన కేబినెట్ విస్తరణపై గౌడ్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఢిల్లీ పర్యటనలో ఉన్న ఆయన.. శనివారం మీడియా ప్రతినిధులతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. మంత్రివర్గ విస్తరణ ఏఐసీసీ, ముఖ్యమంత్రి కనుసన్నలలో జరుగుతుందని.. తాను పార్టీ వ్యవహారాలు మాత్రమే చూస్తున్నానని అన్నారు. కేబినెట్ విస్తరణ పార్టీ హై కమాండ్ చూసుకుంటుందని స్పష్టం చేశారు. త్వరలో పీసీసీ నూతన కార్యవర్గ నియామకం ఉంటుందని.. డీసీసీలుగా ఎమ్మెల్యేలతో పాటు సమర్థులకు కార్యవర్గంలో స్థానం ఉంటుందని అన్నారు. ఇతర పార్టీల నాయకుల చేరికలతో కొన్ని సమస్యలు తలెత్తాయని.. పాత కొత్త నేతలను సమన్వయం చేసుకోవాల్సి ఉందని అన్నారు. జీవన్ రెడ్డి సన్నిహితుడు మరణంతో మనస్తాపానికి లోనయ్యారని.. బాధతో ఆయన లేఖ రాశారన్నారు. జీవన్ రెడ్డి పార్టీలో సీనియర్ నాయకుడని.. ఆయనకు పార్టీ అండగా ఉంటుందని భరోసా కల్పించారు. రాష్ట్రంలో పొలిటికల్ బాంబు పేలుతాయంటూ మంత్రి పొంగులేటి చేసిన కామెంట్స్ స్పందిస్తూ.. గత ప్రభుత్వంలో అవినీతికి పాల్పడిన వారి గురించే పొంగులేటి మాట్లాడారని భావిస్తున్నానని అన్నారు. అక్కినేని ఫ్యామిలీ, సమంతపై కొండా సురేఖ మాటలను పార్టీ పరంగా సమర్థించమన్నారు. వెంటనే కొండా సురేఖ తన మాటలు ఉపసంహరించు కున్నారని గుర్తు చేశారు. రానున్న డిసెంబర్ నెలలో కొన్ని శుభవార్తలు వింటారని మహేష్ గౌడ్ అన్నారు. మరోవైపు.. 2029 ఎన్నికలు మాకు ఫైనల్ అని.. రాష్ట్రం, కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడమే లక్ష్యమని పేర్కొన్నారు. ప్రతి నియోజకవర్గంపై ప్రత్యేక దృష్టి ఉంటుందని తెలిపారు. బీసీ విషయంలో ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న కొంత డివియేట్ అవుతున్నారని.. ఆయనతో నేను, రాష్ట్ర పార్టీ వ్యవహారాల ఇన్ చార్జ్ దీపదాస్ మున్సి మాట్లాడామని.. అన్ని సర్దుకుంటాయని ఆశాభావం వ్యక్తం చేశారు. బీసీ కులగణనపై నవంబర్‌లో సమావేశాన్ని నిర్వహించాలని అనుకుంటున్నామని.. ఆ సమావేశానికి మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీలను ఆహ్వానించామని తెలిపారు. మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అవినీతిపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారని కుమార్ గౌడ్ అన్నారు. వారు చేసిన తప్పులకు కేసీఆర్, కేటీఆర్‌లను రెండు, మూడేళ్లుకాదని.. పదేళ్ల జైలు శిక్ష కూడా తక్కువేనని అన్నారు. అలాగే విద్యుత్ కొనుగోళ్లలో అవకతవకలు జరిగాయని ఆరోపించారు. ఇప్పుడు చాలా తక్కువధరకే విద్యుత్ దొరుకుతుందని స్పష్టం చేశారు. విద్యుత్ చార్జీల పెంపు ఆలోచన లేదని అన్నారు. కేసీఆర్‌కు ఉన్న ఆర్థిక వెసులుబాటు తమకు లేదని చెప్పారు. తెలంగాణ ఏర్పడ్డప్పుడు మిగులు బడ్జెట్‌తో ఉంది, కానీ పదేళ్లలో రూ.8లక్షల కోట్లు కేసీఆర్ తెలంగాణపై అప్పు చేశారని విమర్శించారు. ఏ పథకాన్ని ఆపలేదు. త్వరలోనే పథకాలను



గ్రౌండ్ చేస్తామని హామీ ఇచ్చారు. పదేళ్లలో విడుతాల వారిగా చేసిన దానికంటే తాము రుణమాఫీ చేసిన మొత్తం ఎక్కువేనని చెప్పారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు, కేసీఆర్ చేసిన అప్పులను ప్రజలు అర్థం చేసుకోవాలని అన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చుతాం, పథకాలను ఎగ్గొట్టాలనే ఆలోచన లేదని చెప్పారు. హైడ్రాలో ఒక్కటే పేదల ఇల్లు కూలిందని చెప్పారు. సోషల్ మీడియాలో అనైతికంగా ప్రచారం చేస్తున్నారు. విచ్చలవిడిగా డబ్బు ఖర్చు పెడుతూ పట్టుకుందమంటే పట్టుకునే వీలు లేకుండా విదేశాల్లో ఉంటూ నడుపుతున్నారు. బీఆర్ఎస్ పదేళ్లలో యథేచ్ఛగా చెరువుల కబ్జా జరిగింది. వయనాడులో జరిగిన విధ్వంసం తెలంగాణలో జరగకూడదనే యుద్ధప్రాతిపదికన మూసీ ప్రక్షాళన చేపట్టామని వివరించారు. విడతల వారిగానే మూసీ ప్రక్షాళన చేస్తున్నాం. హైడ్రాతో పేదవారికి నష్టం కలగకుండా చర్యలు తీసుకుంటాం. హైడ్రా, మూసీపై రివ్యూ చేస్తున్నాం. పేద, మధ్యతరగతి వారికి అన్యాయం కలగకుండా చర్యలు ఉంటాయని అన్నారు. జీవో నెంబర్ 29పై ఎవరికి నష్టం జరుగదని అధికారులు చెప్పారు. మెరిట్ లిస్ట్‌లో ఎవరికి అన్యాయం జరగడం లేదు. జీవో నెంబర్ 29పై ఎవరు ఆందోళన చేశారో, ఎందుకు చేశారో తెలియడం లేదన్నారు. నెలలు అవుతుంది, ప్రతిపక్ష నేత ఎక్కడికి పోయాడు. ప్రజల సమస్యలపై కేసీఆర్ ఎందుకు బయటకు రావడం లేదు. కేసీఆర్‌కు ప్రజలు ప్రతిపక్ష నేత హోదా ఇస్తే ఆయన చేస్తున్నది ఏంటని అన్నారు. సీఎం తమ్ముడు తిరుపతి రెడ్డి ఆయన ఇల్లును కూల్చామనే చెప్పారు, కానీ కోర్టు డైరెక్షన్ వల్లే కూల్చలేదు. ప్రభుత్వానికి ఎవరైనా విరాళాలు ఇవ్వొచ్చు, అదాని ఇచ్చారు అంతే. ప్రతిపక్షాల రాద్దాంతంతో ప్రజలు ఆందోళనలో ఉన్నారు, అంతే తప్ప భవిష్యత్ తరాలకోసమే హైడ్రా, మూసీ ప్రక్షాళన అని వివరించారు. జీహెచ్ఎంసీ ఎన్నికల్లో ప్రభావం ఉండదు. బీఆర్ఎస్‌లో ఏముందని చేరతారు. కేసీఆర్ కనబడటం లేదు, ఎవరిని చూసి బీఆర్ఎస్‌లో చేరతారు. ఏ కేసును నీరుగార్చే ప్రయత్నం చేయడం లేదు. ఫోన్ ట్యాపింగ్, డ్రగ్స్,

భూ ఆక్రమణలు ఇలా అన్ని కేసుల విచారణ ఉంటుంది, ఫోన్ ట్యాపింగ్

పెద్ద వ్యవహారం. కేంద్రాచట్టలు వర్తిస్తాయి. కేసీఆర్ చేసినట్లు మేము మోసం చేయమనే క్లారిటీతో ప్రజలున్నారు. పార్టీలో ఉన్న నేతలను కాపాడుకునేందుకే కాంగ్రెస్ ఎమ్మెల్యేలు మాతో టచ్‌లో ఉన్నారని కొందరు చెప్పుకుంటున్నారు. త్వరలోనే మరిన్ని చేరికలు ఉంటాయి. కేటీఆర్‌తో సన్నిహితంగా ఉన్నవాళ్లే కాంగ్రెస్‌లో చేరేందుకు సిద్ధంగా ఉన్నారని మహేష్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు.

# ఆర్థిక విధానాలను ఎన్‌డి పక్షాలు చర్చించాలి !

గత దశాబ్ద కాలంగా మోడీ అనుసరిస్తున్న ఆర్థిక విధానాలు ప్రజల నడ్డి విరిచేలా చేస్తున్నాయి. ధరలు పెరగడం, పేదలు చితికి పోవడం అన్నది సమాంతరంగా సాగుతోంది. అయినా కిందిస్థాయిలో ఏం జరుగు తున్నదో తెలుసుకోలేక పోతున్నారు. కనీసం ఇప్పటికైనా ఎన్‌డిఎ పక్షాలు ఆలోచనచేయాలి. ప్రజలపై మోపుతున్నా భారాలను తగ్గించాలి. ధరల పెరుగుదలపై చర్చించాలి. మోడీ ఆర్థిక విధానాలను చర్చించాలి. లేకుంటే ఎన్‌డిఎ పక్షాలు కూడా ప్రజా వ్యతిరేకతను ఎదుర్కోక తప్పదు. కేవలం కార్పోరేట్ శక్తులు బలపడుతున్న తీరు ప్రజలను కలచి వేస్తోంది. పేద,సామాన్య ప్రజలు ఎంతగా చితికి పోతున్నారో గమనించడం లేదు. జిఎస్టీ కారణంగా వస్తువుల ధరలు పెరిగితే ఎవరికి నష్టమో ఆలోచన చేయడం లేదు. దేనిని వదలకుండా జిఎస్టీ పరిధిలోకి తీసుకుని వచ్చినంత మాత్రాన, ప్రభుత్వ ఆదాయం పెరిగినంత మాత్రాన ఆర్థిక సంస్కరణలు భేషుగ్గా ఉన్నాయంటే ఎవరిని వంచించడానికి అన్నది బిజెపి పాలకులు ఆలోచన చేయాలి. ఎన్‌డిఎ భాసగ్వామ్య పక్షాలైన టిడిపి, జనసేన, ఇతర పార్టీలు కడా దీనిని విశ్లేషించాలి. తాను పట్టిన కుందేటికి మూడే కాళ్లు అన్నచందంగా మోడీ ఉన్నారే తప్ప ఫలితాలను విశ్లేషించుకుని తప్పులను సరిదిద్దుకుందామన్న లక్ష్యాన్ని ప్రకటించడం లేదు. ప్రజల జీవన స్థితిగతులను పట్టించుకోవడం లేదు. ప్రధాని మోడీ కేవలం తాను అనుసరించిన ఆర్థిక విధానాలను ప్రజలు ఆమోదించారంటూ, చెప్పు కోవడం ఆత్మవంచన తప్ప మరోటి కాదు. కేవలం కాంగ్రెస్ ను, విపక్షాలను తిట్టిపోస్తూ రాజకీయం చేయడమే పాలన కాదు. పాలనలో కొత్త ఒరవడి సృష్టించాలి. ప్రజలకు మేలు జరిగేల సంస్కరణలు ఉండాలి. నిరుద్యోగులకు ఉద్యోగాలు రావాలి. ఆహారధాన్యాల ధరలు తగ్గాలి. ఎక్కడ తప్పిదం జరిగిందో పరిశీలన చేయాలి. ప్రజలకు గుజరాత్ మోడల్ అంటూ ప్రచారం చేసి, ప్రధాని పదవిని చేపట్టిన మోడీపై ప్రజలకు విశ్వాసం ఉంటే పరిస్థితులు ఇంత అధ్వాన్నంగా ఎందుకు ఉంటాయి. ప్రజల్లో నివురుగప్పిన అసంతృప్తిని గమనించి సర్దుకోకపోతే వాత తప్పదని మొన్నటి ఎన్నికల ఫలితాల ద్వారా ప్రజలు కొద్దిగా రుచి చూపారు. ఇటీవలి ఎన్నికల్లో ప్రధాని తన వ్యక్తిగత ప్రతిష్ఠను పణంగా పెట్టి ప్రచారం చేశారు. ప్రజల్లో గూడుకట్టుకున్న అసంతృప్తిని తొలగించలేకపోతున్నామని గమనించాలి. సంస్కరణలంటే ప్రజల జీవన ప్రమాణాలు మారాలని గుర్తుంచుకోవాలి. 2014లో మోడీ అధికారంలోకి వచ్చిన తరవాత ధరలను, నేటి మార్కెట్ ధరలను ఎందుకు బేరీజు వేసుకోవడం లేదో ప్రధాని మోడీ ప్రజలకు సమాధానం చెప్పాలి. ఇంతకాలం కాంగ్రెస్ పార్టీ బలహీనంగా ఉన్నా, గట్టిగా పోటీ పడలేకపోయినా ప్రజల ఆలోచనలు కాంగ్రెస్ వైపు మళ్లేలా చేసింది ప్రధాని మోడీ అని గుర్తించాలి. ఇకముందు కాంగ్రెస్ పార్టీ నుంచి గట్టి సవాలు ఎదురవుతుందని భావించాలి. దానికి కాంగ్రెస్ గొప్పతనం కాకుండా మోడీ అనుసరిస్తున్న పిడివాద సంస్కరణల ఫలితమని గుర్తించాలి. హర్యానాలో మళ్లీ అధికారం నిలబెట్టు కోవడం..బిజెపికి ప్రజలు వత్తాసు పలుకుతున్నారని అనుకోరాదు. కాంగ్రెస్ పార్టీ వచ్చే ఎన్నికల్లో రెట్టించిన ఉత్సాహంతో పనిచేస్తుందనడానికి కాశ్మీర్, హర్యానా ఫలితాలే ప్రత్యక్ష నిదర్శనం. తాము ప్రవచిస్తున్న సంస్కరణలు ఎక్కడ దారితప్పాయో గమనించాలి. పివి నరసింహారావు లాగా సంస్కరణలు ప్రజలకు ఎందుకు మేలు చేయలేకపోతున్నాయో పరిశీలన చేయాలి. ఇప్పటికైనా నోట్లరద్దు,జిఎస్టీ విపరిణామాలను విశ్లేషించుకోవాలి. విమర్శలను హెచ్చరికగా తీసుకుని ముందుకు సాగితే తప్ప మనలేమని మిత్రద్వయం గుర్తించి ప్రజలకు మేలుచేసే సంస్కరణలను అమలు చేయాలి. అప్పుడే బిజెపి తన అస్తిత్వాన్ని నిలుపుకోగలదు. ఇకపోతే అధికారంలోకి వస్తే సంవత్సరానికి 2 కోట్ల ఉద్యోగాలు ఇస్తామని మభ్య పెట్టిన మోడీ ఆ ఊసే ఎత్తడం లేదు. పదేళ్లు

కావస్తోంది. స్వయం ఉపాధి పేరుతో నిరుద్యోగులను మభ్యపెడు తున్నారు. గత పదేళ్లలో.. కొత్త ఉద్యోగాలు ఇవ్వకపోగా కార్మిక వ్యతిరేక విధానాలతో వేలాది పరిశ్రమలు మూతపడడానికి కారణం అయ్యారు.బిజెపి ప్రభుత్వ అనాలోచిత, ఏకపక్ష విధానాలు రోజురోజుకు ప్రమాదకరంగా మారుతున్నాయి. పెరుగుతున్న అధిక భారాలు, పన్నులు,

నిరుద్యోగం, నూతన విద్యావిధానం, ప్రభుత్వ రంగసంస్థల ప్రైవేటీకరణ, కార్పొరేటీకరణ, రాజ్యాంగ వ్యవస్థల్లో అనుచిత జోక్యం, రక్షణ రంగంలో ఉద్యోగాల కోతకు వ్యతిరేకంగా దేశ ప్రజలు పోరాడాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఈ కారణంగా కనీసం 6 కోట్ల మందికి ఉపాధి పోయిందని అంచనా. అన్ని సంస్థలను ప్రైవేటుకు అప్పగించే పనిలో మాత్రం వేగం పెంచారు. రైల్వేరంగాన్ని కార్పోరేట్ సంస్థలకు అప్పనంగా అప్పజెప్పుతున్నారు. విశాఖ ఉక్కును నష్టాల పేరుతో విదేశీ కంపెనీలకు అమ్మివేసే ప్రయత్నం చేస్తున్నారు.


# సన్నవడ్లకు రూ.500 బోనస్



సిగ్నల్ ఇచ్చింది. ఉస్మానియా ఆస్పత్రి పునఃనిర్మాణానికి గోషామహల్ పోలీస్ గ్రౌండ్స్ భూమి బదలాయిస్తూ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. దీపావళి పండుగ వేళ ప్రభుత్వ ఉద్యోగులకు కూడా ప్రభుత్వం గుడ్ న్యూస్ చెప్పింది. పెండింగ్‌లో ఉన్న రెండు డీఏల విడుదలకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. మంత్రివర్గ సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు రెండు డీఏలు ఇచ్చేందుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. ఒక డీఏ వచ్చే నెల వేతనంతో.. మరో డీఏ మార్చిలో ఇవ్వాలని ప్రభుత్వ నిర్ణయించింది. పండుగ వేళ పెండింగ్‌లో ఉన్న రెండు డీఏ విడుదలకు ప్రభుత్వం పచ్చజెండా ఊపడంతో ఉద్యోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. డీఏల విడుదలతో పాటు ఈ భేటీలో కేబినెట్ మరికొన్ని కీలక నిర్ణయాలకు ఆమోద ముద్ర వేసింది. ములుగులో సెంట్రల్ ట్రైబల్ యూనివర్శిటీకి ఎకరా రూ.250 చొప్పున 211 ఎకరాల భూమి కేటాయింపు, ఉస్మానియా ఆస్పత్రి నిర్మాణానికి గోషామహల్ పోలీస్ గ్రౌండ్స్ భూమి బదలాయింపుకు మంత్రి మండలి ఒకే చెప్పింది. దీంతో పాటుగా.. ఏటూరు నాగారాన్ని రెవెన్యూ డివిజన్ చేస్తూ క్యాబినెట్ తీర్మానం చేసింది. దీంతో ఏటూర్ నాగారం కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, ప్రజలు బాణా సంచాలు కాల్చుతూ సంబరాలు చేసుకున్నారు. ఇదిలా వుంటే అటు, హైదరాబాద్ నగరంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి తట్టుకోలేక కొందరు కావాలనే విష ప్రచారం చేస్తున్నారని ఉప ముఖ్యమంత్రి భట్టి మండిపడ్డారు. నరెడ్కో నిర్వహిస్తోన్న ప్రాపర్టీ షోను శనివారం ఆయన సందర్శించారు. మూసీ నిర్వాసితులకు అద్భుతమైన జీవితాన్ని ఇవ్వాలని ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందన్నారు. నిర్వాసితులకు వారు ఉండే చోట అద్భుతమైన టవర్స్ నిర్మించి.. వారి పిల్లలకు ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ నిర్మిస్తామని తెలిపారు. మూసీ నిర్వాసిత మహిళలతో పాటు నగరంలోని డ్వాక్రా మహిళలకు వడ్డీ లేని రుణాలు అందిస్తామన్నారు. మరోవైపు, స్థిరాస్తి వ్యాపారుల సమస్యల

పరిష్కారానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.

# దీపావళి కానుకగా.. ఇందిరమ్మ ఇళ్లు




న్యాయసలహా తీసుకొని అసెంబ్లీలో చర్చించి ముందుకు వెళ్లాలని మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది. నవంబరు 30 వరకూ రాష్ట్రంలో కుల గణన సర్వే పూర్తి చేయాలి. నవంబరు 4 నుంచి 19 వరకూ రాష్ట్రమంతటా ఇంటింటి సర్వే చేపట్టాలి. దాదాపు 80వేల ఎన్యూమరేటర్లను సర్వే విధులకు డిప్యూట్ చేస్తారు. వారికి త్వరలో శిక్షణ ఇస్తారు. సోమవారం నుంచి జిల్లా కలెక్టర్ల సమావేశంతో ఈ ప్రక్రియ ప్రారంభమవుతుంది. ఒక్కో ఎన్యూమరేటర్ నిర్ణీత గడువు లోగా 150 ఇళ్ల నుంచి వివరాలు సేకరిస్తారు. దీనికి సంబంధించిన విధి విధానాలను, ప్రశ్నావళిని క్యాబినెట్ ఆమోదించింది. సమగ్ర సమాచారాన్ని సేకరించబోతున్నాం. ఆ వివరాలను పబ్లిక్ డొమైన్‌లో ఉంచుతాం. అందరూ స్పందించాలి. ఈ ప్రక్రియకు సంబంధిత సంఘాలన్నీ సహకరించాలి.

ధాన్యం సేకరణకు సుమారు 6వేలకు పైగా కేంద్రాలను ఏర్పాటు చేయాల్సి ఉండగా.. ఇప్పటికే కొన్ని ఏర్పాటయ్యాయి. మరికొన్నింటిని త్వరలో ఏర్పాటు చేయబోతున్నాం.

గత ప్రభుత్వంలో రైస్‌మిల్లర్ల దగ్గర రూ.20 వేల కోట్ల ధాన్యం మిగిలిపోయింది. దీనిపై క్యాబినెట్ విస్తృతంగా చర్చించింది. ఇతర రాష్ట్రాల్లో దీనిపై ఏవిధమైన నిర్ణయాలు తీసుకున్నారో పరిశీలించిన తర్వాత.. ఇతర రాష్ట్రాల కంటే తెలంగాణ రాష్ట్రానికి మంచి జరిగేలా నిర్ణయం తీసుకోవాలని మంత్రివర్గం నిర్ణయించింది. ఇప్పటికీ డిఫాల్టర్లుగా ఉన్నవారిని మొత్తంగా తొలగించాలని క్యాబినెట్ నిర్ణయించింది. రాష్ట్ర ప్రభుత్వం మిల్లర్లకు ధాన్యాన్ని కేటాయించేటప్పుడు వారి స్థాయిలను బట్టి బ్యాంక్ గ్యారెంటీలు తీసుకొంటుంది.

హైదరాబాద్‌లో మెట్రో రైలు రెండో దశ విస్తరణకు సంబంధించిన డీపీఆర్‌కు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. నాగోల్- శంషాబాద్, రాయదుర్గం-కోకాపేట్, ఎంజీబీఎస్-చాంద్రాయణగుట్ట, మియాపూర్-పటాన్‌చెరు, ఎల్‌బీనగర్-హయత్‌నగర్.. మొత్తం 76.4 కి.మీ. విస్తరణ చేపట్టాలని నిర్ణయించింది. ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి ఈ ప్రాజెక్టు చేపట్టాలని తీర్మానించింది. మొత్తం రూ.24,269 కోట్లతో ఈ ప్రతిపాదనలను రూపొందించారు. దీనికి సంబంధించిన డీపీఆర్‌ను కేంద్ర ప్రభుత్వ ఆమోదానికి పంపిస్తారు. రాష్ట్రంలో పంచాయతీరాజ్, ఆర్అండ్‌బీ శాఖల్లో 16-17 వేల కి.మీ. రహదారులను నిర్మాణం చేయాల్సి ఉంది. వీటి అభివృద్ధికి సమగ్ర ప్రతిపాదనలు సిద్ధం చేయాలని మంత్రివర్గం నిర్ణయం తీసుకొంది. ప్రతి గ్రామ పంచాయతీ నుంచి మండల కేంద్రానికి బీటీ రోడ్డు.. మండల కేంద్రం నుంచి జిల్లాలకు డబుల్ రోడ్డు.. జిల్లా కేంద్రాల నుంచి హైదరాబాద్‌కు ఫోర్ లేన్ రోడ్డు ఉండేలా అభివృద్ధి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా ఎంచుకుంది. అందుకు అనుగుణంగా ఇప్పుడు ఉన్న రోడ్లను అభివృద్ధి చేయడం.. కొత్త రోడ్ల నిర్మాణానికి అవసరమైన ప్రణాళికలను రూపొందించడం వంటి ప్రక్రియలను మొదలుపెట్టాలని మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది.






# బీజేపీ పాలనలో "ప్రజాస్వామ్యం" అపహాస్యం.

- రాజ్యంగ హక్కులు హరింపు.
- రాష్ట్రంలో ఉచిత బస్సుతో... పథకాలన్నీ అమలు చేసినట్టు కాదు.
- సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జ్యోతి.
- ప్రజా శ్రేయస్సు కోసం పోరాటం ఆగదు.
- పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పాలడుగు భాస్కర్.
- ఘనంగా సీపీఐ(ఎం) జిల్లా 28వ మహాసభలు.







**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, అక్టోబర్ 26:**

కేంద్రంలోని బీజేపీ పాలనలో "ప్రజాస్వామ్యం" అపహాస్యం పాలవుతుందని, రాజ్యంగ హక్కులు హరింపబడుతున్నాయని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు టి.జ్యోతి అన్నారు. దేశ ప్రజానీకం అనేక సమస్యలు ఎదుర్కొంటుందని, ఆర్థిక సంక్షోభం ముంచుకొస్తున్న వేళ, అదాయ అసమానతలు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఉద్యోగుల, కార్మికుల వేతనాలు తగ్గుతుండగా, బడా కార్పోరేట్ వ్యాపారుల వాటా అమాంతంగా పెరుగుతోంది. ఫలితంగా ఉద్యోగులు, మహిళలు ఉద్యోగాలు కోల్పోతున్నారని అన్నారు. వీటన్నింటి నుంచి దృష్టి మరల్చేందుకు కేంద్రంలో అధికారంలో ఉన్న ఎన్‌డీఏలోని బీజేపీ ప్రభుత్వం మత ఉద్రేకాలను రెచ్చగొడుతోంది ఆరోపించారు. సీపీఐ(ఎం) నిజామాబాద్ జిల్లా 28వ మహాసభలు జిల్లా కేంద్రంలో శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. నగరంలోని ధర్నాచౌక్ నుంచి రైల్వేస్టేషన్, ఖలీల్‌వాడీ మీదుగా మహాసభలు జరిగే రాజీవ్‌గాంధీ ఆడిటోరియం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొన్నారు. అనంతరం సభ ప్రాంగణంలో సీపీఐ(ఎం) జెండాను పార్టీ సీనియర్ నాయకులు గంగాధరప్ప ఆవిష్కరించారు. అనంతరం పార్టీ జిల్లా కార్యదర్శి రమేశ్‌బాబు అధ్యక్షతన బహిరంగ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన టి. జ్యోతి ప్రసంగించారు. 'రాజకీయ అవినీతి, అప్పులు, ప్రపంచ బ్యాంక్ షరతులతో బంగ్లాదేశ్‌లో ఆర్థిక సంక్షోభం చుట్టుముట్టిందని, విద్యార్థుల ఉద్యమాలతో ఆ దేశ ప్రధాని దేశం విడిచి పారిపోవాల్సి వచ్చిందన్నారు. అదే విధంగా శ్రీలంకలో సైతం పాలు, పండ్లు, కనీసం బ్రెడ్ దొరకని పరిస్థితి నెలకొనడంతో ప్రజలు పెద్దఎత్తున తిరుగుబాటు చేపట్టారని, వామపక్షాల ఆధ్వర్యంలో ఉద్యమాలు చేపట్టడంతో ఇటీవల జరిగిన ఎన్నికల్లో వామపక్ష అభ్యర్థికి పట్టం కట్టారని గుర్తు చేశారు. పాలకుల తీరుతో ప్రజలకు వచ్చే ఆక్రోశం, పోరాటాలకు చేయూతనిచ్చేవి వామపక్షాలే అని మరోసారి నిరూపితమైందని అన్నారు. దేశంలో మూడో సారి అధికారంలోకి రావాలని బీజేపీ ప్రభుత్వం ఉవ్విళ్లురింది. కానీ ప్రజలు కర్రుకాల్చి వాత పెట్టినట్టు చేయడంతో సీట్ల సంఖ్య తగ్గి, ఇతర పార్టీలను కలుపుకొని అధికారంలోకి వచ్చిందని అన్నారు. అయినా బీజేపీ తీరు మారలేదని, ఇటీవల ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో ప్రజల ఆకలి గోడు పట్టించుకోలేదని, విద్యా, వైద్య రంగాలకు అత్యంల్పంగా కేటాయింపులు చేశారని అన్నారు. ఉద్యోగ కల్పన మరిచిందన్నారు. దేశంలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందని అన్నారు.

**ఉచిత బస్సుతో.. పథకాలన్నీ అమలు చేసినట్టు కాదు**

రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి పది నెలలు గడుస్తుందని, అయినా ఎన్నికల కంటే ముందు ఇచ్చిన హామీలు అమలు చేసిన దాఖలాలు లేవని అన్నారు. ఆర్టీసీలో మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించడం ఒక్కటే, పథకాలన్నీ అమలు చేసినట్టు కాదని ఎద్దేవ చేశారు. రైతులకు పూర్తిస్థాయిలో రుణమాఫీ కాలేదని, రైతుభరోసా అడిగితే మళ్లొచ్చే పంటకు ఇస్తామనడం సరికాదని అన్నారు. ఆశాల, అంగన్‌వాడీల, బీడీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం పట్టించుకోకపోవడంతోనే ప్రజలు కాంగ్రెస్‌ను ఎన్నుకున్నారని, కానీ బీఆర్ఎస్, కాంగ్రెస్ పరస్పర ఆరోపణలు చేసుకుంటు ప్రజా సమస్యలు విస్మరిస్తున్నారని అన్నారు.

**ప్రజాశ్రేయస్సుకు పోరాటం ఆగదు : పాలడుగు భాస్కర్.**

ప్రజా సమస్యల పరిష్కారంకు సిపిఎం పోరాటం ఆగదని, ఓట్ల కోసం, సీట్ల కోసం కాకుండా ఆ ప్రజా శ్రేయస్సుకు నిస్వార్థంగా కృషి చేస్తున్నామన ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పాలడుగు భాస్కర్ అన్నారు. నిజామాబాద్ జిల్లాను పాలకుల అసమర్థ విధానాలతో వెనుకపడేశారని, పరిశ్రమలు ఏర్పాటు చేసుకునే వీలు ఉన్నా, పట్టింపు లేదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు ఎస్ రమ, ప్రజానాట్య మండలి రాష్ట్ర అధ్యక్షులు ఆనంద్, సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పెద్ది వెంకట్‌రాములు, నూర్జహాన్, పల్లపు వెంకటేశ్, శంకర్‌గౌడ్, జిల్లా కమిటీ సభ్యులు సుజాత, కొండ గంగాధర్, జంగం గంగాధర్, ప్రజానాట్య మండలి జిల్లా కార్యదర్శి సిర్పలింగం, తదితరులు పాల్గొన్నారు.




# జర్నలిస్టుల అక్రెడిటేషన్ల జీవో 1395ను సవరించాలి.






- మీడియా అకాడమీ చైర్మన్ ఏకపక్ష నిర్ణయాలను అడ్డుకోవాలి.
- అక్రెడిటేషన్ల విధి విధానాల కమిటీలో
- జర్నలిస్టు సంఘాలకు ప్రాతినిధ్యం ఇవ్వాలి.
- మంత్రి పొంగులేటికి టీడబ్ల్యూజేఎఫ్ విజ్ఞప్తి.

**వేగుచుక్క న్యూస్, హైదారాబాద్, అక్టోబర్ 26:**

జర్నలిస్టుల అక్రెడిటేషన్ కార్డులకు సంబంధించి నియమ నిబంధనల మార్పు కోసం ప్రభుత్వం జారీ చేసిన జీవో 1395 లోపభూయిష్టంగా, ఏకపక్షంగా ఉందని, ఈ జీవోను వెంటనే సవరించి ప్రభుత్వం వేసిన అన్ని జర్నలిస్టు సంఘాలకు, చిన్న పత్రికలకు, మహిళా జర్నలిస్టులకు అవకాశం కల్పించాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) డిమాండ్ చేసింది. ఈ మేరకు ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య, ప్రధాన కార్యదర్శి బి. బసవపున్నయ్య, ఉపాధ్యక్షులు పులిపలుపుల ఆనందం, బండి విజయ్ కుమార్, ఎల్గొయి ప్రభాకర్, తదితరులు శనివారం రాష్ట్ర సమాచార, పౌరసంబంధాలు, రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని కలిసి వినతి పత్రం సమర్పించారు. ఇటు ప్రభుత్వానికి,అటు ప్రజలకు మధ్య వారధిగా ఉంటూ గురుతర బాధ్యతలను నిర్వర్తిస్తున్న జర్నలిస్టులు సమాజం బాగోగులే లక్ష్యంగా పనిచేస్తూ సర్కారుకు సహకరిస్తున్నారని, అలాంటి జర్నలిస్టులకు గుర్తింపు కోసం ప్రభుత్వం సమాచార శాఖ నుంచి అక్రెడిటేషన్ కార్డులను ఇస్తున్నదని అన్నారు. తెలంగాణలో 2015 లో అక్రెడిటేషన్ రూల్స్ తో పాటు జర్నలిస్టు సంఘాలకు ప్రాతినిధ్యం కల్పిస్తూ జీవో 239 ను అప్పటి ప్రభుత్వం విడుదల చేసిందని, రూల్స్ ఫ్రేమ్ చేయడానికి మాజీ సంపాదకులు రామచంద్ర మూర్తి నేతృత్వంలో అల్లం నారాయణ, కే. శ్రీనివాస్ రెడ్డి, క్రాంతికిరణ్, కే శ్రీనివాస్ ఇతర సీనియర్ ఎడిటర్లతో కలిపి కమిటీ వేసి అక్రెడిటేషన్ ల మార్గదర్శకాలు రూపొందించారని తెలిపారు. వాటిని జీవో 239 ద్వారా ఆమోదించి గత పదేండ్లుగా అమలు చేస్తున్నారని, అయితే తాజాగా అక్రెడిటేషన్ రూల్స్ మార్చేందుకు ప్రభుత్వం జీవో 1395 ను జారీ చేసిందని, అయితే ఈ జీవో అసంబద్ధంగా ఉందని పేర్కొన్నారు. ఈ జీవో కు సవరణ చేయాలని డిమాండ్ చేశారు. ఈ జీవో లో సీనియర్ ఎడిటర్ లు కాకుండా మీడియా అకాడమీ ముసుగులో ఉన్న ఒక జర్నలిస్టు యూనియన్ చెందిన వారికే ప్రాతినిధ్యం కల్పించారని ఆరోపించారు. గతంలో ఇచ్చిన జీవో 239 ప్రకారం మూడు జర్నలిస్టు సంఘాలకు అవకాశం ఇవ్వాలని, కానీ ఇవ్వలేదని, అలాగే చిన్న పత్రికలను, మహిళా జర్నలిస్టులను పట్టించుకోలేదని వారు మంత్రితో అన్నారు. మీడియా అకాడమీ కనుసన్నల్లో ప్రభుత్వం ఏకపక్షంగా జారీ చేసిన ఈ కొత్త జీవోను ఖచ్చితంగా సవరించిన తరువాతే అక్రెడిటేషన్ కార్డుల నిబంధనలపై నిర్ణయం తీసుకోవాలని కోరారు. గతంలో నిబంధనలు రూపొందించిన పెద్దమనుషులే మళ్లీ ఇప్పుడు కొత్త నిబంధనల జపం చేస్తున్నారని, మీడియా అకాడమీ ముసుగులో ఉన్న ఒక యూనియన్ గానీ, మీడియా అకాడమీ గానీ జర్నలిస్టుల అక్రెడిటేషన్ల విషయంలో వాస్తవాలు చెప్పడం లేదని విమర్శించారు. తన ప్రాబల్యాన్ని పెంచుకునేందుకు ఆ యూనియన్ తప్పుడు చర్యలకు పాల్పడుతుందని, దానికి మీడియా అకాడమీ ఛైర్మన్ మద్దతు ఇస్తూ ప్రభుత్వాన్ని జర్నలిస్టుల్లో పలుచన చేసే ప్రయత్నం జరుగుతుందని అన్నారు. ఏకపక్ష ధోరణి, తప్పుడు నిర్ణయాల వల్ల ప్రభుత్వం విమర్శలకు గురయ్యే అవకాశం ఉందని, ఈ విషయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా పునరాలోచించి తాజా జీవో 1395 ను సవరించాలని వారు కోరారు. జర్నలిస్టు సంఘాలతో పాటు చిన్నపత్రికలకు, మహిళా జర్నలిస్టులకు కమిటీలో అవకాశం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం వారు సమాచార పౌరసంబంధాల శాఖ కమీషనర్ హనుమంతరావుకు ఇచ్చే వినతి పత్రాన్ని జాయింట్ డైరెక్టర్ జగన్ కు సమర్పించారు. మంత్రిని కలిసిన వారిలో ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శులు సలీమా,చంద్రశేఖర్,రాజశేఖర్, నేషనల్ కౌన్సిల్ మెంబర్ రమాదేవి, హెచ్ యూజే కార్యనిర్వాహక కార్యదర్శి నాగవాణి, పి.విజయ తదితరులు ఉన్నారు.







# కేజీఎఫ్, కాంతార రికార్డులు బద్దల అవుతాయి


పుష్ప.2పై డిస్ట్రిబ్యూటర్ వ్యాఖ్యలపై కన్నడీలు ఫైర్ 'పుష్ప 2' చిత్రం విడుదల గురించి ఇటీవల హైదరాబాద్‌లో నిర్మాతలు డిస్ట్రిబ్యూటర్స్‌తో కలిసి ఓ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ వేదికపై కన్నడ డిస్ట్రిబ్యూటర్ లక్ష్మీకాంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు కన్నడనాట వివాదానికి గురి చేసింది. 'పుష్ప 2 చిత్రాన్ని కేజీఎఫ్, కాంతార రికార్డులు బద్దలయ్యే స్థాయిలో విడుదల చేస్తామని, మాగ్జిమం షోలను ప్లాన్ చేస్తామని వెల్లడించారు. అయితే ఇప్పుడు ఆ మాటే కన్నడిగులకు మండేలా చేసినట్లయింది. తమ రెండు బ్లాక్ బస్టర్ సినిమాలను దాటుతామని చెప్పడంతో కన్నడ సినీ అభిమానులు సోషల్ మీడియాలో అసహనాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఇతర సినిమాల ఆధిపత్యం మీద అక్కడి నిర్మాతలు కొందరు చాలాకాలంగా గుర్రుగా ఉన్నారు. తెలుగు చిత్రాలైన బాహుబలి, ఆర్‌ఆర్‌ఆర్, సలార్ టైంలో వాటికి ఎక్కువ స్క్రీన్లు ఇచ్చి తమకు అన్యాయం చేస్తున్నారంటూ విమర్శలు కూడా చేశారు. అలాగే ఎప్పటి నుంచో డబ్బింగ్ సినిమాల విడుదలను అడ్డుకుంటు వస్తున్నారు. ఇతర భాషా చిత్రాలను కట్టడి చేయాలనే డిమాండ్ అక్కడ కొంత కాలంగా ఉంది. కన్నడ సీనియర్ హీరో రాజ్ కుమార్ ఉన్న కాలంలోనే ఇతర భాషా సినిమాల విడుదలను ఆపేసిన పరిస్థితి. అయితే కొన్నేళ్ల క్రితమే ఆ రూల్స్‌ను తీసేశారు. అప్పటి నుంచి అక్కడ ఏ సినిమా విడుదలైనా కన్నడ వెర్షన్ కంటే ఇప్పటికీ తెలుగు, తమిళం ఒరిజినల్ వెర్షన్లే ఎక్కువ ప్రదర్శనలు జరుగుతున్నాయనే చర్చ నడుస్తోంది. ఈ క్రమంలో తాజాగా పుష్ప 2 కన్నడ డిస్ట్రిబ్యూటర్ లక్ష్మీకాంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు అగ్గి రాజేసినట్లయింది. నిజానికి డిసెంబర్ మొదటివారంలో పుష్ప 2 మినహా చెప్పుకొదగ్గ కన్నడ సినిమాలేవీ రిలీజ్ లేవు. కానీ కన్నట నాట వారి భాషకు సంబంధించి అక్కడి ప్రజలు పలు సంఘాలు చాలా పర్టిక్యూలర్‌గా ఉంటున్నాయి. కర్ణాటకలో ఉండే వారు కచ్చితంగా కన్నడ మాట్లాడాల్సిందేనంటూ ఇటీవలే కొన్ని వార్నింగ్‌లు ఇచ్చిన సంఘటనలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో 'పుష్ప 2' విడుదలపై కన్నడ సినిమాలను మించి చేస్తాం అనడం మరో రచ్చకు దారి తీశాయి. కన్నడిగుల కోపం పుష్ప-2పై ఎలాంటి ప్రభావం చూపిస్తుందో మరి. అల్లు అర్జున్ హీరోగా సుకుమార్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రం డిసెంబర్ 5న ప్రేక్షకుల ముందుకు రానుంది.

# మీకేంటీ బాధ బాడీ షేమింగ్‌పై మండిపడ్డ అలియాభట్

బాడీ షేమింగ్ ఫిల్మ్ ఇండస్ట్రీకి కొత్తేమీ కాదు. తరచూ ఎవరో ఒకరి మీద బాడీ షేమింగ్ కామెంట్స్ వస్తూనే ఉంటాయి. తాజాగా బాలీవుడ్ క్యూటీ ఆలియాభట్ ఈ సమస్యను ఎదుర్కొంటోంది. ఆమెకు కాస్మొటిక్ సర్జరీ ఫెయిల్ అయిందంటూ సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతోంది. ఈ మధ్యన ఆమె నవ్వితే మూతి వంకర పోతుందని కొన్ని కామెంట్లు సోషల్ మీడియాలో కనిపిస్తున్నాయి. ఆమె మాట్లాడుతున్నప్పుడు కూడా ముఖం తేడాగా కనిపిస్తోందని కొంతమంది విమర్శలు చేస్తున్నారు. సోషల్ వీడియాలో తనను ట్రోల్ చేస్తున్న వారిపై ఆలియా మండిపడ్డారు. తన లుక్స్ గురించి కామెంట్ చేస్తున్న వారి కోసం ఆలియా ఓ పోస్ట్ పెట్టింది. "కాస్మెటిక్ కరెక్షన్ లేదా సర్జరీ చేయించుకునే ఎవరి గురించి మాట్లాడను, జడ్జ్ చేయను. మీ శరీరం, మీ ఇష్టం. కానీ దీనిపై నడుస్తున్న ట్రోలింగ్ హాస్యాస్పదంగా ఉంది. నేను చేయించుకున్న బొటాక్స్ ఫెయిల్ అయిందంటూ వీడియోలు వైరల్ అవుతున్నాయి. మీ అభిప్రాయం ప్రకారం, నేను వంకరగా నవ్వుతాను, మాట్లాడినప్పుడు వింతగా ఉంటాను. నా ముఖం ఒకవైపు పక్షవాతానికి గురైందని మాట్లాడుతున్నారు. ఎలాంటి ఆధారాల్లేకుండా ఇలాంటి వీడియోలు ఎలా చేస్తారు. ఇలాంటి కామెంట్స్ చేసేటప్పుడు దానికి వెనక ఏముంది. అసలేం జరిగింది అన్నది తెలుసుకోరా? ప్రతి వ్యక్తికి కొన్ని ఇష్టాలు, నిర్ణయాలు, సొంత ఛాయిస్‌లు ఉంటాయి. వాళ్లకు నచ్చినట్లు జీవితాన్ని సాగిస్తుంటారు. వాళ్ల వ్యక్తిగత జీవితంలోకి వెళ్లి భూతద్దం పెట్టి చూడటం 100 శాతం తప్పే. ఇతరుల వ్యక్తిగత జీవితాల గురించి మీకు ఎందుకు? అంటూ మండిపడింది. తాజాగా ఆమె నటించిన 'జిగ్రా' చిత్రం విడుదలైంది. భారీ అంచనాల మధ్య విడుదలైన ఈ సినిమా అంతంత మాత్రంగా ప్రేక్షకాదరణ పొందింది.

# రూ.1500 కోట్ల భారీ బడ్జెట్‌తో సినిమా





హాలీవుడ్ హీరోలకన్నా ధీటుగా మహేష్ బాబుదర్శక ధీరుడు రాజమౌళి ప్రస్తుతం మహేష్ బాబును హీరోగా పెట్టి పాన్ వరల్డ్ సినిమా తీయబోతున్నారు. దుర్గా ఆర్ట్స్ పతాకంపై డాక్టర్ కె.ఎల్.నారాయణ, ఎస్.గోపాల్ రెడ్డి దీన్ని రూ.1500 కోట్ల భారీ బడ్జెట్ తో నిర్మిస్తున్నారు. హాలీవుడ్ సినిమాలను తలదన్నే రీతిలో రాజమౌళి ఈ సినిమాను తీయనున్నట్లు చెబుతున్నారు. అందుకే మహేష్ బాబును హాలీవుడ్ హీరోలకన్నా ధీటుగా తయారుచేస్తున్నారు. దీనిపై ఇప్పటికే మహేష్ బాబు శిక్షణ తీసుకున్నాడు. ప్రస్తుతం రాజమౌళి ఏఐ నేర్చుకుంటున్నారు. తాను నేర్చుకుంటున్న విషయాలను తన టీంతో పంచుకుంటున్నారు. ఆ రెండు సినిమాలు బాగా నచ్చాయి ఏ దర్శకుడికైనా ఒక హీరోకు సంబంధించిన సినిమాల్లో అన్నీ నచ్చాలనే నిబంధన లేదు. కొన్ని సినిమాలు కచ్చితంగా నచ్చుతాయి. అలా రాజమౌళికి మహేష్ బాబు సినిమాల్లో బాగా నచ్చినవి రెండు ఉన్నాయి. అవి ఒక్కడు, పోకిరి. ఈ రెండు సినిమాల్లో మహేష్ బాబు తనను తాను కొత్తగా చూపించుకున్నారని, ఈ సినిమాల్లో కొత్తగా కనిపించాడని ఓ ఇంటర్వ్యూలో రాజమౌళి చెప్పారు. వీటిల్లో సరికొత్త మహేష్ బాబును చూశానని, ఏ పాత్రనైనా అవలీలగా పోషించగల సత్తా మహేష్ బాబుకు ఉందని ఆయన కొనియాడారు. "650 రోజుల నుంచి ఒకే థియేటర్‌లో ఆడుతున్న జూనియర్ ఎన్టీఆర్ సినిమా" సంక్రాంతికి ప్రెస్ మీట్ మహేష్ బాబు అభిమానులు రాజమౌళి ఎటువంటి అప్ డేట్ ఇవ్వడంలేదంటూ విసుగ్గా ఉంటున్నారు. అయితే సంక్రాంతికి ప్రెస్ మీట్ పెట్టి సినిమాకు సంబంధించిన వివరాలు తెలియజేసే అవకాశం ఉందంటున్నారు. ఆఫ్రికన్ అడవుల్లో సినిమా తీయనున్నారని, ఫారెస్ట్ అడ్వెంచర్ గా సినిమా రూపుదిద్దుకోబోతోందని, ఇంతవరకు హాలీవుడ్ లో కూడా రానివిధంగా ఈ సినిమాను రాజమౌళి పట్టాలెక్కించబోతున్నారని తెలుస్తోంది. ఈ సినిమా విజయం సాధిస్తే మహేష్ బాబు హాలీవుడ్ హీరో అయినట్లేనని, ఇంగ్లిషు సినిమాలే చేస్తారని అభిమానులు కామెంట్లు పెడుతున్నారు. ఈ సినిమా తర్వాత మహేష్ బాబు ఎటువంటి నిర్ణయం తీసుకుంటాడా? అనేదే అత్యంత ఉత్కంఠగా సినీ పరిశ్రమలోను, అభిమానుల్లో నెలకొంది.


## విడాకులు తీసుకున్న వ్యక్తితో నాని హీరోయిన్ నిశ్చితార్థం

### ఆ ఫొటోలు షూటింగ్‌లో భాగమే



తమిళనాడులో జయం రవికి మంచి క్రేజ్ ఉంది. జయం రవి నుంచి సినిమా వస్తుందంటే మినిమమ్ గ్యారెంటీ ఉంటుందనే విధంగా ఆయన పేరు సంపాదించుకున్నారు. అయితే జయం రవి వైవాహిక జీవితం గురించి గత కొద్ది రోజులుగా అనేక రూమర్స్ వైరల్ అయ్యాయి. జయం రవి ఆర్తిని ప్రేమ వివాహం చేసుకున్నారు. ఈ జంటకు ఇద్దరు కుమారులు కూడా ఉన్నారు. అయితే వీరిద్దరి మధ్య అభిప్రాయభేదాలు రావడంతో విడిపోవాలని చూస్తున్నారని,విడాకుల కోసం కోర్టును కూడా ఆశ్రయించినట్లు పుకార్లు వచ్చాయి. ఈ పుకార్లను నిజం చేస్తూ ఈ జంట విడాకులు తీసుకున్నారు. అధికారికంగా తాము విడిపోతున్నట్టు జయం రవి తెలిపారు. అయితే విడాకుల గురించి తనని సంప్రదించకుండానే ప్రకటించారని జయం రవి భార్య ఆర్తి ఆవేదన వ్యక్తం చేసింది. జయం రవి ఆర్తిని ప్రేమ వివాహం చేసుకున్నారు. అయితే భార్య నుంచి విడాకులు తీసుకుని పది రోజులు కూడా కాకుండానే జయం రవి మరో అమ్మాయితో క్లోజ్‌గా మూవ్ అవుతూ కనిపించారు. "పెళ్లాం పోర్న్ టార్చర్.. రోజుకు 3 సార్లు నావల్ల కాదంటూ కోర్టుకెళ్లిన భర్త.. చివరికి!" జయం రవి కేనిషా ఫ్రాన్సిస్ అనే సింగర్‌తో రిలేషన్‌లో ఉన్నట్టు వార్తలొస్తున్నాయి. వీరిద్దరు డేటింగ్ చేస్తున్నారని రూమర్స్ తెర మీదకు వస్తున్నాయి.


# సాయి ధరమ్ తేజ కేరీర్‌లో బిగ్ ప్రాజెక్టు



విరూపాక్ష వంటి బ్లాక్‌బస్టర్ చిత్రం తర్వాత మెగా సుప్రీమ్ హీరో సాయి ధరమ్ తేజ్ నటిస్తోన్న కొత్త చిత్రం షూటింగ్ శరవేగంగా జరుగుతున్న విషయం తెలిసిందే. రోహిత్ కెపి దర్శకత్వం వహిస్తోన్న ఈ సినిమాను హనుమాన్ వంటి భారీ చిత్రాన్ని అందించిన నిర్మాతలు కె నిరంజన్ రెడ్డి, చైతన్య రెడ్డి ప్రైమ్‌షో ఎంటర్‌టైన్‌మెంట్‌పై ఈ పాన్ ఇండియా ప్రాజెక్ట్‌ను హై బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. అయితే ఈ సినిమా.. ప్రపంచ రికార్డులను బద్దలుకొట్టిన ఓ హాలీవుడ్ సినిమా రీమేక్ అని తెలుస్తోంది. ఇంతకీ ఆ మూవీ ఏంటి.. తేజ్ ఏమన్నాడంటే.. ప్రముఖ హాలీవుడ్ దర్శకుడు 'జాక్ సిండర్' దర్శకత్వం వహించిన సినిమా '300'. యుద్ధం నేపథ్యంలో యుద్ధవీరుల సాహసాల కథ ఆధారంగా తెరకెక్కిన ఈ సినిమా ప్రపంచ సినిమా చరిత్రలో సరికొత్త అధ్యాయం. 2006లో రిలీజైన ఈ సినిమాని ఇండియాలోని అన్ని భాషల్లో ఫ్రీమేక్ చేశారు. తాజాగా తెరకెక్కనున్న సాయి ధరమ్ తేజ్ సినిమా కూడా అదే అని వార్తల్లొచ్చాయి. దీనిపై హీరో తేజ్ స్పందిస్తూ.. 300 సినిమా నుండి ఇన్‌స్పైర్ చెందే ఈ సినిమాని రూపొందిస్తున్నామన్నారు. తేజ్ కెరీర్‌లోనే ప్రతిష్టాత్మకంగా తెరకెక్కుతున్న ఈ సినిమాని 120-130 కోట్ల భారీ బడ్జెట్ తో నిర్మిస్తున్నట్లు సమాచారం.

# కార్మికులకు పీఆర్సీ బకాయిలను చెల్లించాలి.

## బిఎల్ టియు రాష్ట్ర అధ్యక్షులు దండి వెంకట్ డిమాండ్.



**వేగుచుక్క న్యూస్, ఆర్మూర్, అక్టోబర్ 26:**

మున్సిపల్ కార్మికులకు 2021లో గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రకటించిన 30 శాతం పిఆర్సి బకాయిలను వెంటనే చెల్లించాలని బిఎల్ టియు రాష్ట్ర అధ్యక్షులు దండి వెంకట్ డిమాండ్ చేశారు. ఆర్మూర్ మున్సిపల్ కార్మికులకు ఇంతవరకు ఇవ్వకపోవడంపై జిల్లా కలెక్టర్ కు పిర్యాదు చేస్తామని అన్నారు. శనివారం ఆర్మూర్ లో నిర్వహించిన మున్సిపల్ కార్మికుల సమావేశంలో దండి వెంకట్ మాట్లాడారు. మున్సిపల్ ఔట్ సోర్సింగ్ కార్మికులు అత్యంత శ్రమ దోపిడి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తమది ప్రజా ప్రభుత్వమని చెపుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం మున్సిపల్ ఔట్ సోర్సింగ్ కార్మికులను వెంటనే పర్మనెంట్ చేయాలని, ఆలోపు కనీస వేతనం రూ 26 వేలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ కార్మికులను వేధిస్తే సహించేది లేదని, ఆర్మూర్ మున్సిపల్ కమిషనర్ కార్మికులను ఉద్దేశించి ఒళ్ళు దగ్గర పెట్టుకోవాలని, తోలు వొలుస్తానని బెదిరించడం ఒక ప్రభుత్వ అధికారి మాట్లాడే మాటలు కావని దండి వెంకట్ అన్నారు. మున్సిపల్ ఔట్ సోర్సింగ్ కార్మికులకు చట్టబద్ధంగా రావాల్సిన పిఎఫ్ ఈఎస్ఐ ఇన్సూరెన్స్ బకాయిలను గత రెండు సంవత్సరాలుగా ఇవ్వడం లేదని ముందు వాటిపై దృష్టి సారించాలని కమిషనర్ ను కోరారు. పిఎఫ్, ఈఎస్ఐ, ఇన్సూరెన్స్ బకాయిలు పేరుకు పోవడానికి కారణం 7మందితో గ్రూప్ లు చేయడం వల్లేనని తెలిపారు. మహిళా కార్మికులు అనారోగ్యానికి గురైతే ఈఎస్ఐ లివ్ తీసుకోవాల్సి ఉంటుంది.కానీ ఈఎస్ఐ లివ్ పెడితే కార్మికులను పని నుండి తొలగిస్తామని శానిటేషన్ ఎస్ఐ బెదిరిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల రాజేందర్, ఆర్మూర్ మున్సిపల్ అధ్యక్షులు సిహెచ్. ప్రసాద్, ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్, ఓ. పాండు, బి.రాజన్న తదితరులు పాల్గొన్నారు.

# అంతర్రాష్ట్ర తనిఖీ కేంద్రాల వద్ద గట్టి నిఘా.

## - కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు.

**వేగుచుక్క న్యూస్,నిజామాబాద్, అక్టోబర్ 26 :**



జిల్లాలోని అంతర్రాష్ట్ర సరిహద్దు ప్రాంతాల చెక్ పోస్టుల వద్ద గట్టి నిఘా కొనసాగిస్తున్నామని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు తెలిపారు. సరిహద్దు ప్రాంతాల చెక్ పోస్టుల స్థితిగతులపై రాష్ట్ర రవాణా శాఖ కమిషనర్ ఇలంబర్తి శనివారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సంబంధిత జిల్లాల కలెక్టర్లు, రవాణా శాఖ అధికారులతో సమీక్ష జరిపారు. సరిహద్దు చెక్ పోస్టుల వద్ద కట్టుదిట్టమైన నిఘా కొనసాగేలా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని కమిషనర్ సూచించారు. ఉమ్మడి తనిఖీ కేంద్రాల వద్ద ఇంకనూ ఏవైనా సదుపాయాలు అవసరం ఉన్నట్లయితే ప్రతిపాదనలు పంపాలని సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు మాట్లాడుతూ, పొరుగున గల మహారాష్ట్రకు ఆనుకుని ఉన్న జిల్లాలోని సాలూరా, కందకుర్తి, పోతంగల్, ఖండ్ గాం ప్రాంతాలలో ఇంటిగ్రేటెడ్ చెక్ పోస్టులు కొనసాగుతున్నాయని తెలిపారు. రవాణా, అటవీ, ఎక్సైజ్, పోలీస్, రెవెన్యూ, వాణిజ్య పన్నుల శాఖలు ఉమ్మడి చెక్ పోస్టుల వద్ద సంయుక్తంగా తనిఖీలు నిర్వహిస్తున్నాయని అన్నారు. ప్రతి చెక్ పోస్టు వద్ద రెండు చొప్పున సీ.సీ కెమెరాలను కూడా ఏర్పాటు చేసి అక్రమ రవాణాకు ఆస్కారం లేకుండా అనునిత్యం పకడ్బందీ పర్యవేక్షణ జరిపిస్తున్నామని తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్ లో రవాణా శాఖ అధికారులు పాల్గొన్నారు.

# ఆఫీసులోకి డాక్యుమెంట్ రైటర్లు రావద్దు.

## - రిజిస్ట్రేషన్ శాఖ డీఐజీ రమేశ్ రెడ్డి.

**వేగుచుక్క న్యూస్, కామారెడ్డి, అక్టోబర్ 26:**



సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలోకి డాక్యుమెంట్ రైటర్లు రావద్దని ఉమ్మడి నిజామాబాద్ జిల్లా రిజిస్ట్రేషన్ శాఖ డీఐజీ రమేశ్ రెడ్డి అన్నారు. శనివారం ఆయన కామారెడ్డి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కార్యాలయంలో రిజిస్ట్రేషన్లకు సంబంధించిన వివరాలపై ఆరా తీశారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సేవలు అందించాలని ఆదేశించారు. కార్యాలయంలో ఉన్న డాక్యుమెంట్ రైటర్లనుద్దేశించి వాళ్లు ఎందుకు వచ్చారని ప్రశ్నించారు. కార్యాలయంలో ప్రైవేట్ వ్యక్తులు కనిపించవద్దని సబ్ రిజిస్ట్రార్ ను ఆదేశించారు.

# బీ.సీ కమిషన్ పర్యటన పకడ్బందీ ఏర్పాట్లు.

## - సన్నాహక సమావేశంలో అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్.

**వేగుచుక్క న్యూస్,నిజామాబాద్, అక్టోబర్ 26**



: రాష్ట్రంలో స్థానిక సంస్థల వారీగా కల్పించాల్సిన రిజర్వేషన్ల దామాషాపై ఆయా రాజకీయ పార్టీలు, సంఘాలు, ప్రజల అభిప్రాయాలను తెలుసుకునేందుకు వీలుగా తెలంగాణ బీసీ కమిషన్ ప్రతినిధుల బృందం ఈ నెల 29న నిజామాబాద్ కు విచ్చేయనున్న నేపథ్యంలో పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని అదనపు కలెక్టర్ ఎస్.కిరణ్ కుమార్ అధికారులకు సూచించారు. బీ.సీ కమిషన్ పర్యటనను పురస్కరించుకుని శనివారం ఐ.డీ.ఓ.సీలో సంబంధిత అధికారులతో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్ ఆయా శాఖల అధికారులకు వారు నిర్వర్తించాల్సిన విధుల గురించి వివరిస్తూ, బాధ్యతలను పురమాయించారు. నిజామాబాద్, కామారెడ్డి ఉమ్మడి జిల్లాకు సంబంధించి ఈ నెల 29 న నిజామాబాద్ లోని సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (కలెక్టరేట్)లో ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు కమిషన్ చైర్మన్ నిరంజన్ నేతృత్వంలోని బీసీ కమిషన్ స్థానిక సంస్థలలో రిజర్వేషన్ల దామాషాపై అభిప్రాయాలు సేకరిస్తుందని అన్నారు. ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 1.00 గంట వరకు నిజామాబాద్ జిల్లాకు సంబంధించిన వారు, భోజన విరామం

అనంతరం మధ్యాహ్నం 2.00 గంటల నుండి సాయంత్రం 4.00 గంటల వరకు కామారెడ్డి జిల్లాకు చెందిన వారు రాతపూర్వకంగా తమ అభిప్రాయాలను కమిషన్ కు నివేదించవచ్చని తెలిపారు. సన్నాహక సమావేశంలో డీఆర్డీఓ సాయాగౌడ్, జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారిణి స్రవంతి, నిజామాబాద్ ఆర్డీఓ రాజేంద్రకుమార్, ఎస్సీ కార్పొరేషన్ ఈ.డీ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# కామారెడ్డికి రూ"5 కోట్ల సిడిఎఫ్ నిధులు.

## - ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి.

**వేగుచుక్క న్యూస్, కామారెడ్డి, అక్టోబర్ 26:**



నియోజక వర్గ అభివృద్ధికి "5 కోట్ల సిడిఎఫ్ నిధులు ప్రభుత్వం మంజూరు చేసిందని ఎమ్మెల్యే కాటిపల్లి వెంకట రమణ రెడ్డి శనివారం తెలిపారు. గతంలో రూ.25 కోట్ల పనులకి ప్రతిపాదనలు పంపగా 5 కోట్ల రూపాయలు మంజూరు చేసినట్లు పంచాయత్ రాజ్ శాఖ ఉత్తర్వులు జారి అయ్యాయని తెలిపారు. మిగతా రూ.20 కోట్ల పనులు కూడా త్వరలోనే మంజూరు చేస్తా అని మాట ఇచ్చిన పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్కకి శాసన సభ్యులు కాటిపల్లి వెంకట రమణ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

# టియులో ఇంటర్ కాలేజ్ మెన్స్ కబడ్డీ సెలక్షన్స్.





**వేగుచుక్క న్యూస్, డిచ్ పల్లి, అక్టోబర్ 26**

: తెలంగాణ యూనివర్సిటీ ఇంటర్ కాలేజ్ కబడ్డీ మెన్ సెలెక్షన్స్ శనివారం విశ్వవిద్యాలయం క్రీడా మైదానంలో నిర్వహించామని వర్సిటీ డైరెక్టర్ స్పోర్ట్స్ డా జి. బాలకిషన్ తెలిపారు. ఈ సెలెక్షన్స్ కి ఉమ్మడి జిల్లా నుండీ దాదాపు 50 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. అందులో నుండి క్రీడా నైపుణ్యం కలిగిన క్రీడాకారులు సందీప్, ఆకాష్, గోవింద్, శివ, మనోహిత్, నర్సింహా మోహిత్, సిద్దార్థ్, నరేష్, నరేష్, శివ, సందీప్, అభిలాష్, కార్తీక్, సాయికుమార్ విద్యార్థుల ను ఎంపిక చేశారు. ఈ ఎంపికైన వర్సిటీ కబడ్డీ టీం చెన్నై లో జరుగు సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ కబడ్డీ టోర్నమెంట్ లో పాల్గొంటుందని ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ బి ఆర్ నేత తెలిపారు. ఈ సెలెక్షన్స్ లో జి జి కళాశాల, వివిధ కళాశాలల పి.డీలు డాక్టర్ బాలమణి, డాక్టర్ కుమారస్వామి, ప్రశాంత్, బుచ్చన్న వివిధ కళాశాలల ఇంచార్జిలు, క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ టోర్ని ప్రారంభానికి ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య సిహెచ్ ఆరతి,డైరెక్టర్( పి ఆర్ ఓ ) డా.ఏ. పున్నయ్య, చీఫ్ వార్డెన్ డా.ఐలేని మహేందర్ తదితరులు పాల్గొనున్నారు.

# చేర్యాల మండలంలో దారుణ ఘటన

చేర్యాల: నలుగురిలో అవమానం భరించలేక ఓ విద్యార్థి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటనచేర్యాల మండలంలో కలకలం రేపింది. కాపీ కొట్టావంటూ ప్రిన్సిపల్ కొట్టడంతో బాధపడుతున్న ఆ విద్యార్థిని...తండ్రికూడా అవమానించాడు. దీంతో ట్టుకోలేక ఉరేసుకున్నాడు. ప్రిన్సిప్రాల్ కొట్టాడని తండ్రికి చెప్పగా.. అతను వచ్చి తోటి విద్యార్థుల ముందు తనను కొట్టాడని భరించలేని ఆ విద్యార్థి తీవ్ర మనస్తాపానికి గురై ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన సిద్దిపేట జిల్లా చేర్యాల మండలంలో శనివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని శభాష్ గూడెం గ్రామానికి చెందిన 13 ఏళ్ల విద్యార్థి స్థానికంగా ఉన్న ఓ ప్రైవేటు పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నాడు. శుక్రవారం పాఠశాలలో జరిగిన ఓ పరీక్షలో కాపీ కొడుతున్న విద్యార్థిని గమనించిన ప్రిన్సిపాల్ అతన్ని కొట్టడంతోపాటు తండ్రికి ఫిర్యాదు చేశాడు. దీంతో ఆ విద్యార్థి తండ్రి పాఠశాలకు వచ్చి తోటి విద్యార్థుల ఎదుట కొడుకును కొట్టాడు. ప్రిన్సిపల్‌తోపాటు తండ్రి కూడా చేయిచేసుకోవడాన్ని జీర్ణించుకోలేని ఆ విద్యార్థి.. శనివారం ఉదయం గ్రామ శివారులోని ఓ వ్యవసాయ బావి వద్ద ఉన్న చెట్టువద్దకు వెళ్లి ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దీన్ని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. కొమురవెల్లి ఎస్సై రాజు, పోలీసులు ఘటనాస్థలికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ఆసుపత్రికి తరలించారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# టపాకాయల దుకాణంకు అనుమతి తీసుకోవాలి.

## - ఇన్చార్జి పోలీస్ కమిషనర్ సింధు శర్మ.

**వేగుచుక్క న్యూస్ , నిజామాబాద్, అక్టోబర్ 26:**



దీపావళి పండుగ సందర్భంగా టపాకాయల దుకాణాదారులు తప్పకుండా సంబంధిత డివిజినల్ స్థాయి పోలీస్ అధికారుల అనుమతి తీసుకోవాలి అని నిజామాబాద్ ఇంచార్జీ సిపి సింధు శర్మ శనివారం వెల్లడించారు. దీపావళి పండుగ సందర్భంగా నిజామాబాద్ పోలీస్ కమీషనరేటు పరిధిలో తాత్కాలిక టపాకాయల దుకాణాలు నెలకొల్పేవారు సంబంధిత పోలీస్ డివిజినల్ అధికారి కార్యాలయం నుండి ధరఖాస్తు చేసుకొని అనుమతి పొందగలన్నారు. దానికి సంబంధించిన ఇతర సమాచారం కోసం సంబంధిత డివిజినల్ స్థాయి అధికారిని సంప్రదించాలన్నారు. ఎవ్వరయిన సంబంధిత పోలీస్ డివిజినల్ స్థాయి అధికారి నుండి అనుమతిలేకుండా టపాకాయల దుకాణాలను నెలకొల్పినట్లయితే వారిపై ఎక్స్ ప్లోజివ్ యాక్టు 1884 మరియు రూల్స్ 1933 సవరణ 2008 ప్రకారంగా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. టపాకాయల దుకాణాదారులు తప్పక నిబంధనలు పాటించాలన్నారు. టపాకాయల దుకాణాలు సంబందిత ఖాళీ ప్రదేశాలలో నెలకొల్పవలెను. ఖాళీ ప్రదేశానికి సంబంధించిన ఎన్.ఓ.సి సర్టిఫికేటు పొందుపర్చాలి. ఒక క్లస్టర్ లో 50 షాపులకు మించరాదు. జనరద్దీగల ప్రదేశాలలో ఎలాంటి టపాకాయల షాపుల ఏర్పాటు చేయరాదు. అదేవిధంగా కళ్యాణ మండపాలలో మరియు సమావేశాల కేంద్రాలలో టపాకాయల దుకాణాలు నెలకొల్పరాదు. తాత్కాలిక టపాకాయల దుకాణాలలో ఫైర్ కు సంబంధించిన జాగ్రత్తలు తప్పక పాటించేవిధంగా తగు జాగ్రత్తలు తీసుకోవాలి. ఈ దరఖాస్తు ఫారం పోలీస్ వెబ్సైట్ www.nizam-abadpolice.in లో ఆన్లైన్లో పొందపర్చడం జరిగిందన్నారు. దరఖాస్తు ఫారం డౌన్లోడ్ చేసుకొని, పూర్తి వివరాలతో సంబంధిత ఎ.సి.పి కార్యాలయంలో ధరఖాస్తు చేసుకోవాలన్నారు.

# రేవంత్ వైఖరి వల్లనే పోలీసులు రోడ్డెక్కారు

హైదరాబాద్: సీఎం రేవంత్‌రెడ్డి వైఖరి వల్లనే కానిస్టేబుళ్ల కుటుంబాలు రోడ్డెక్కాల్సి వచ్చిందని మాజీ మంత్రులు, బీఆర్ఎస్ మహిళా నేతలు సబిత ఇంద్రారెడ్డి,సునీతా లక్ష్మారెడ్డిలు ఆరోపించారు. హోంశాఖ నిర్వహిస్తోన్న రేవంత్ ఫెయిల్ అవ్వటంతోనే పోలీస్ కుటుంబాలు బయటకు వచ్చాయని చెప్పారు. శనివారం తెలంగాణ భవన్‌లో సబిత ఇంద్రారెడ్డి మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ... ఏక్ పోలీస్ వ్యవస్థపై సీఎం రేవంత్

మాటను నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. 18రోజులకు 4రోజులు కుటుంబంతో గడిపే పాత పద్ధతిని కొనసాగించాలని తెలిపారు. మహిళలపై అఘాయిత్యాలు రాష్ట్రంలో సర్వసాధారణంగా మారాయని అన్నారు. డీజీపీ స్థాయి అధికారులు జోక్యం చేసుకుని సమస్యను పరిష్కరించాలని సబితా ఇంద్రారెడ్డి పేర్కొన్నారు. రక్షకభటులే న్యాయం కావాలని రోడ్డు ఎక్కటం బాధాకరంగా ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. పోలీసులు రోడ్డు ఎక్కటం చరిత్రలోనే మెదటసారి అని చెప్పారు. ప్రజా పాలన అంటే.. ఇదేనా రేవంత్ రెడ్డి అని ప్రశ్నించారు. తెలంగాణలో హోంమంత్రి లేకపోవటంతోనే. కానిస్టేబుళ్ల బాధ ఎవరకి చెప్పుకోవాలో తెలియని పరిస్థితి నెలకొందని అన్నారు. యూనిఫాం వేసుకుని ధర్నాలు చేయాల్సిన పరిస్థితి తెలంగాణలో వచ్చిందని.. అయినా ప్రభుత్వం నుంచి కనీస స్పందన లేకపోవడం బాధాకరమని చెప్పారు. స్వాతంత్రం దేశంలో పోలీసులే నిరసన చేపట్టడం తొలిసారి అని ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి అన్నారు. పోలీసులతో ఇళ్లలో వివిధ పనులు చేర్పిస్తున్నారని ధ్వజమెత్తారు. పోలీస్ సమస్యలు పరిష్కారం చేయాలని ప్రభుత్వం కోరారు. సచివాలయం ముందు రోజూ ధర్నాలు జరగటం బాధాకరమని అన్నారు. రాష్ట్రంలో ప్రజాపాలన ఉందా అనే అనుమానం కలుగుతోందని ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి పేర్కొన్నారు.

ఇప్పటికైనా తగు చర్యలు తీసుకుని పోలీసులకు న్యాయం చేయాలన్నారు.